



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 28, 2026 | సంపుటి : 2 | సంచిక : 317 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు



**హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని సీఎం వెల్లడించారు.

### సహోదరత్వం అత్యంత గొప్ప బంధం: కేసీఆర్

రాఖీ నేపథ్యంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాలలో సహోదరత్వం అత్యంత గొప్ప బంధం అని పేర్కొన్నారు. అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధం అజరామరం అని తెలిపారు. రాఖీ బంధన్ భారత కుటుంబ జీవనంలో ప్రత్యేక సంప్రదాయ వేడుక అని చెప్పారు. ప్రజలంతా సౌభ్రాతృత్వంతో జీవించడంతోనే వసుదైక కుటుంబ భావన పరిఢవిల్లుతుందన్నారు.

## వారంలో తెలంగాణ కేబినెట్ విస్తరణ!

- ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన?
- పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు
- ఖాళీగా ఉన్న రెండు బెర్తులు భర్తీ
- కొండా సురేఖ ఎపిసోడ్‌పై కొనసాగుతున్న సస్పెన్స్
- వరంగల్‌లో పెరుగుతున్న రాజకీయ ఉత్కంఠ
- కేబినెట్ ప్రక్షాళనపై కాంగ్రెస్‌లో చర్చ



**హైదరాబాద్:**
కొండా సురేఖ ఫ్యామిలీ ఎపిసోడ్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. కేబినెట్ విస్తరణ, ప్రక్షాళనతోనే ఈ ఎపిసోడ్‌కు ఎండ్‌కార్డ్ వేసే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉంది. వారంలో తెలంగాణ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశముందని సమాచారం. విస్తరణలో భాగంగా పలువురు మంత్రుల శాఖల మార్పు.. ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాముందని చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.
ఇదిలా ఉండగా.. శాఖల మార్పు సంకేతాలతో తమ శాఖలో పూర్తయిన పనులకు రిబ్బన్ కటింగ్ చేసేందుకు మంత్రులు సిద్ధమయినట్లు తెలుస్తోంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాగా, వరంగల్‌లో రాజకీయ ఉత్కంఠత కొనసాగుతుంది, వరంగల్ ఈస్ట్, పరకాల నియోజకవర్గాల్లో అనధికార పర్యటనలో పాల్గొంటున్న మంత్రి కొండ సురేఖ.. నో పొలిటికల్ కామెంట్స్ అంటూ ఆమె మీడియాకు దూరంగా ఉంటున్నారు. అదే రీతిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు కూడా మౌనం పాటిస్తున్నారు. అయితే, ఒక వైపు ఏం జరుగుతుందోన్న ఆందోళనలో వరంగల్ ఈస్ట్ కొండా క్యాడర్ ఉంటే.. మరో వర్గం సంబరాలు చేసుకుంటున్నారు.

మిగతాది 2లో




2 లో

## డీలిమిటేషన్‌పై మోదీకి ఖర్గే లేఖ

- ఆల్‌పార్టీ సమావేశం పెట్టాలని డిమాండ్
- రాష్ట్రాలకు తగినంత సమయం ఇవ్వాలని సూచన
- 543 ఎంపీ సీట్లు మరో 25 ఏళ్లు కొనసాగించాలని ప్రతిపాదన
- రాష్ట్రాల ప్రస్తుత వాటా కొనసాగించాలని డిమాండ్
- 2029 నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

## ‘ఢిల్లీకి ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా?’

- పాలిటెక్నిక్ విద్యార్థులపై కేసులా?
- రేవంత్ సర్కారుపై హరీశ్‌రావు ఫైర్
- ‘విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు’
- రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలి
- తెలంగాణకు వచ్చి విద్యార్థుల కోసం పోరాడాలి




**వరంగల్:**
పాలిటెక్నిక్ విద్యార్థులపై రేవంత్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని మండిపడ్డారు. పాలిటెక్నిక్ విద్యార్థులేమన్నా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారాయన. తెలంగాణ విద్యార్థుల సమస్యలు రేవంత్‌కు పట్టవా?అని నిలదీశారు హరీష్‌రావు.

మిగతాద్ది 2 లో



## రక్షాబంధన్ ఈసారి ప్రత్యేకం.. లక్ష చెట్లకు రాఖీలు కట్టనున్న గ్రామస్థులు..!

- చెట్లకు రాఖీలు కట్టనున్న గ్రామస్థులు
- లక్ష చెట్లకు రాఖీలు కట్టే కార్యక్రమం
- 700 గ్రామాల్లో ‘సేవ్ ట్రీ’ ప్రచారం
- చెట్ల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయనున్న ప్రజలు
- 3 లక్షల చెట్లకు రాఖీలు కట్టాలని లక్ష్యం
- 24 జిల్లాల్లో నెల రోజుల కార్యక్రమం
- 2004లో ప్రారంభమైన వినూత్న కార్యక్రమం

2 లో



## మహిళలంటే గౌరవం.. ప్రెస్‌మీట్ పెట్టను: అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల:**
మహిళలంటే తనకు చాలా గౌరవం, వారిపై తాను ప్రెస్ మీట్లు పెట్టనని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై స్పందిస్తూ ఆయనీ వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..



## మైనింగ్ ఏడీ నివాసంలో ఏసీబీ సోదాలు.. భారీగా ఆస్తులు గుర్తింపు

- మైనింగ్ ఏడీ ఇంటిపై ఏసీబీ దాడులు
- 12 చోట్ల ఏకకాలంలో సోదాలు
- భారీగా అక్రమ ఆస్తుల గుర్తింపు
- 2 అంతస్తుల భవనం, 2 కార్లు
- రూ.1.50 లక్షల నగదు స్వాధీనం
- 5 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తింపు
- ఎఫ్‌డీలు, పోస్టల్ డిపాజిట్ల పరిశీలన
- కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

2 లో

## ఓయూకు రూ.1,000 కోట్లు ఇస్తామన్నారు



- ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్న రామచందర్‌రావు
- ఏడాది గడిచినా నిధులు మంజూరు కాలేదని విమర్శ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లు
- పాలిటెక్నిక్‌ల రద్దును వ్యతిరేకించిన బీజేపీ
- విద్యార్థుల ఉద్యమానికి నైతిక మద్దతు

**హైదరాబాద్:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా..

2లో..



## ఆ ఇద్దరి వ్యవహారంపై అంతిమ నిర్ణయం ఏఐసీసీదే: మహేశ్‌కుమార్‌గౌడ్

**నిజామాబాద్ అర్బన్:**
రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి వ్యవహారంపై ఏఐసీసీ అంతిమ నిర్ణయం తీసుకోనుందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారిద్దరిపై క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదికను పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు పంపించినట్లు తెలిపారు.



## తెలంగాణకు చెందిన 22 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది: పొంగులేటి

**హైదరాబాద్:**
నేపాల్ వరదల పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో తెలంగాణకు చెందిన 23 మంది చిక్కుకున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిలో ఆరుగురు రాష్ట్ర వాసులు కాగా, 17 మంది ప్రవాస తెలంగాణ వారని మంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పర్యాటకుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు మంత్రి చెప్పారు. చిక్కుకున్నవారి వివరాలు విదేశాంగశాఖకు పంపించినట్లు పేర్కొన్నారు. కేంద్రం, నేపాల్‌లోని రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

## రూ.31 కోట్ల వడ్లు మాయం



- రెండు రైస్ మిల్లుల్లో గోల్‌మాల్
- 8,000 టన్నులకు పైగా వడ్లు దారి మళ్లింపు
- మిల్లర్ వెంకటేశ్వర్లు అరెస్ట్
- రూ.24 కోట్ల బకాయిలు గుర్తింపు
- జనగామ మిల్లులో మరో రూ.7 కోట్ల డీఫాల్ట్
- రూ.6.46 కోట్ల సీఎంఆర్ డీఫాల్ట్
- మిల్లు నిర్వాహకురాలు సుభాషిణి అరెస్ట్

సీఎంఆర్ పెండింగ్‌పై సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ సీరియస్‌గా దృష్టి పెట్టింది. బకాయిలు ఉన్న మిల్లులపై విజిలెన్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్స్ వరుసగా దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాయి.
ఈ క్రమంలో ఓ మిల్లర్‌ను నెల రోజుల వ్యవధిలోనే ఇటు యాదాద్రి, అటు జనగామ జిల్లాల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనంతారంలోని యాదాద్రి రైస్ మిల్లులో నూనె వెంకటేశ్వర్లు, రామ్మోహన్ తో పాటు మరికొందరు భాగస్వాములు ఉన్నారు. జులైలో ఆఫీసర్లు నిర్వహించిన తనిఖీల్లో 6,668 టన్నుల వడ్లు కనిపించలేదు.

మిగతాది 2లో



## మణుగూరులో యువకుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

**మణుగూరు:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో దారుణం చోటుచేసుకుంది. సుమారు 30-40 మంది యువకులు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. పాత కక్షల నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు యువకులపై సుమారు 30 మంది దాడి చేయగా, శివ (25) అనే యువకుడు మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## హన్మకొండలో విషాదం..

### పెళ్లికి వెళ్తొస్తుండగా.. బావిలోకి దూసుకెళ్లిన కారు

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళపల్లి గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రయాణికుల కారు అకస్మాత్తుగా అదుపుతప్పి పల్టీలు కొడుతూ నీళ్ల లేని బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏలూరి రాధమ్మ (70) అనే వృద్ధురాలు.. బావిలో కారు టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 28, 2026

## మైనింగ్ ఏడీ నివాసంలో ఏసీబీ సోదాలు..
# భారీగా ఆస్తులు గుర్తింపు

మొదటిపేజీ తరువాయి
జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భగనుల శాఖ ఏడీ జయరాజు నివాసాల్లో ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరుగుతున్నాయి. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో సూర్యాపేట, తాండూరు, సహా 12చోట్ల తనిఖీలు చేపట్టారు. బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్ నగర్‌లోని జయరాజు నివాసంలో.. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు తదితర వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. సోదాల్లో ఇప్పటివరకు రెండు అంతస్తుల భవనం, రెండు కార్లు, రూ.1.50 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, జనగాం జిల్లాలో 5 ఎకరాల వ్యవసాయ భూమి, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాల అనంతరం ఆస్తుల విలువ, స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర వివరాలను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

## ఓయూకు రూ.1,000 కోట్లు ఇస్తామన్నారు

మొదటిపేజీ తరువాయి
రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు."టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదు. మీ నిర్ణయం సరైనది అయితే.. మళ్లీ కమిటీ ఎందుకు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.15వేల కోట్లకు చేరాయి. యంగ్ ఇండియా స్కూల్స్ అని గొప్పగా చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి.. భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో విద్యార్థులు వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే. విద్యార్థులను రాజకీయంగా వాడుకునే కాన్సెప్ట్‌కు మేం వ్యతిరేకం. వారి ఉద్యమంలోకి మేం వెళ్లం.. నైతికంగానే మద్దతు ఇస్తాం" అని రామచందర్‌రావు తెలిపారు

## హన్మకొండలో విషాదం..
### పెళ్లికి వెళ్లొస్తుండగా.. బావిలోకి దూసుకెళ్లిన కారు

మొదటిపేజీ తరువాయి
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని, వీరంతా తిరిగి కారులో తమ స్వగ్రామానికి బయలుదేరిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందినవారిగా గుర్తించారు.
ఈ ప్రమాదంలో కారులో ఉన్న రవీందర్ రెడ్డి, వీరారెడ్డి, కిరణ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై.. తాడు సహాయంతో బావిలోకి దిగి క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా వారిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

## రక్షాబంధన్ ఈసారి ప్రత్యేకం..
## లక్ష చెట్లకు రాఖీలు కట్టనున్న గ్రామస్థులు..!

మొదటిపేజీ తరువాయి
తోబుట్టువుల చేతికి రాఖీ కట్టడం చూశాం.. మరి చెట్లకు రాఖీ కట్టడం ఎప్పుడైనా చూశారా? ఝార్ఖండ్‌లో ఈసారి రక్షాబంధన్‌కు ఇదే ప్రత్యేకత. అడవులను కాపాడటమే లక్ష్యంగా వేల మంది గ్రామస్థులు శుక్రవారం సుమారు లక్ష చెట్లకు రాఖీలు కట్టేందుకు సిద్ధమయ్యారు. 'సేవ్ ట్రీ' ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని 700 గ్రామాల్లోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నట్లు అధికారులు తెలిపారు. చెట్టుకు రాఖీ కట్టిన ప్రతి ఒక్కరూ దాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయనున్నారు. నెల రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 3 లక్షల చెట్లకు రాఖీలు కట్టాలని అటవీశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.
గుమ్లా జిల్లా జోరాడ్‌లో అటవీశాఖ అధికారి సంజీవ్ కుమార్ చెట్టుకు రాఖీ కట్టి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆయన ఆలోచనతోనే 2004లో ధన్‌బాద్ జిల్లాలో ఈ వినూత్న కార్యక్రమం మొదలైంది. ఈ ఆలోచన క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పటివరకు 12 వేలకు పైగా గ్రామాలు ఈ కార్యక్రమంతో మమేకమయ్యాయి.

# 'ఢిల్లీకి ఒక నీతి..
## తెలంగాణకు మరో నీతా?'

మొదటిపేజీ తరువాయి
'విద్యార్థులు వారి భవిష్యత్తు కోసం పోరాటం చేస్తుంటే వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండడం మా దౌర్భాగ్యం అంటున్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నావ్. తెలంగాణ విద్యార్థులు నీ కంటికి కనిపించడం లేదా...?, జెన్ జీ అంటూ ఢిల్లీలో ధర్నాలు చేస్తున్న రాహుల్ గాంధీకి ఈ పాలిటెక్నిక్ విద్యార్థులు కనిపించడం లేదా?, జెన్ జీ రోడ్డెక్కి పోరాడుతుంటే ఎందుకు స్పందించడం లేదు.
ఢిల్లీకి ఒకనీతి.. తెలంగాణకు మరో నీతా రాహుల్ గాంధీ. రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి విద్యారుల కోసం పోరాడాలి. ఢిల్లీ తరహాలో విద్యార్థులు తిరగడబడక ముందే.... ఢిల్లీ తరహా ఉద్యమాలు జరగక ముందే... రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు' అని హెచ్చరించారు.

# మహిళలంటే గౌరవం.. ప్రెస్‌మీట్ పెట్టను: అనిరుధ్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి
'ఇంట్లో మా అమ్మ తిట్టినా తల వంచుకుంటానే తప్ప ఎదురు మాట్లాడను. మహిళల ఒక్క చుక్క కంటనీరు నేలపై పడ్డా అది సునామీ అయిపోయి మనం అందులో కొట్టుకుపోతామ'ని వ్యాఖ్యానించారు.
కొండా సురేఖ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ వ్యవహారంపై ఎవరూ మాట్లాడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కొండా సురేఖ అంశంలో ఎమ్మెల్యేలు నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు తనను ఎవరూ ఆహ్వానించలేదని వెల్లడించారు. చిన్నారెడ్డి చాలా సీనియర్ నాయకుడని, ఆయన విషయంలో తానేమి మాట్లాడబోనని అన్నారు.

**ప్రశ్నిస్తూనే ఉంటా**

తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని చెప్పారు. పెండింగ్ బిల్లుల కోసం అవసరమైతే భట్టి విక్రమార్కతో కొట్లాడుతానని, ఈయకపోతే దీక్షకు దిగుతానని వ్యాఖ్యానించారు. కాగా, కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# రూ.31 కోట్ల వడ్లు మాయం

మొదటిపేజీ తరువాయి
2022-23 యాసంగి టెండర్ బకాయిలతో కలిపి సుమారు రూ.24 కోట్లు సివిల్ సప్లై శాఖకు చెల్లించాల్సి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నూనె వెంకటేశ్వర్లు, ఇతర భాగస్వాములకు సంబంధించిన ఆస్తులను సీజ్ చేయించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భువనగిరి పోలీసులు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చారు.

**జనగామలో మరో కేసు..**

జనగామ జిల్లా నెల్లుట్లలోని మణికంఠ రైస్ మిల్లులో 11 మంది భాగస్వాములు ఉన్నారు. వీరిలో యాదాద్రి జిల్లాలోని రైస్ మిల్లులో భాగస్వాములుగా ఉన్న నూనె వెంకటేశ్వర్లు, రామ్మోహన్ సైతం ఉన్నారు. ఈ మిల్లుకు సంబంధించి రూ.3.70 కోట్ల బకాయిలతో పాటు 2022-23 ఆక్షన్ ప్యాడీకి సంబంధించిన 1,526 టన్నులు, 2024-25 సీజన్‌కు సంబంధించిన 995 టన్నులకుపైగా వడ్లకు సంబంధించి మొత్తం సుమారు రూ.7 కోట్లు సివిల్ సప్లై శాఖకు చెల్లించాల్సి ఉంది.

మిల్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేసినా స్పందన రాకపోవడంతో అధికారులు చర్యలకు దిగారు. జనగామ జిల్లా లింగాలఘణపురం పోలీసులు ఈ నెల 22న యాదాద్రి జిల్లా భువనగిరిలో వెంకటస్వామిని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం మంగళవారం రిమాండ్‌కు తరలించారు. నూనె వెంకటేశ్వర్లు భాగస్వామిగా ఉన్న రెండు మిల్లుల్లో కలిపి సుమారు రూ.31 కోట్ల విలువైన వడ్లు దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు.

**రూ.6.46 కోట్ల సీఎంఆర్ డీఫాల్ట్.. మిల్లు నిర్వాహకురాలి అరెస్ట్**

మహబూబాబాద్, వెలుగు: సీఎంఆర్ డీఫాల్ట్ కేసులో ఓ మిల్లు నిర్వాహకురాలిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని భుక్యారాంతండా శివారులోని మహాదేవ ఆగ్రో ఇండస్ట్రీస్ పేరుతో మిల్లు నిర్వహిస్తున్నారు.

ఈ మిల్లులో వరంగల్ విజిలెన్స్, ఎన్ పోర్స్ మెంట్, జిల్లా సవిల్?సప్లై అధికారులు దాడులు చేయగా.. 2023=24 ఖరీఫ్ సీజన్ కు చెందిన రూ. 6.46 కోట్ల విలువైన 1,586.714 టన్నుల వడ్లు మాయమైనట్లు తేలింది. దీంతో మిల్లు నిర్వాహకురాలు సుభాషిణిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

## డీలిమిటేషన్‌పై
# మోదీకి ఖర్గే లేఖ

మొదటిపేజీ తరువాయి
నియోజకవర్గాల పునర్విభజనపై పీఎం మోదీకి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. కేంద్రం పార్లమెంట్ స్పెషల్ సెషన్ ఆలోచనలోఉన్నందున డీలిమిటేషన్ పై అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చకు ఆల్ పార్టీ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రతిపాదనలను పరిశీలించడానికి రాజకీయ పార్టీలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగినంత సమయం ఇవ్వాలన్నారు.
మల్లికార్జు ఖర్గే రాసిన లేఖలో ఏమన్నారంటే... ఇప్పటికే 2026జూలై 16న డీలిమిటేషన్ పై లేఖ రాశా. వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభనకు కేంద్రమే కారణం. డీలిమిటేషన్ పై కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉంది. డీలిమిటేషన్ అనేది దేశానికి అత్యంత ముఖ్యమైన అంశం.2026 ఏప్రిల్ 16, 17 తేదీలలో మీరు ప్రయత్నించినట్లుగా మళ్లీ బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించవద్దు. విపక్షాల అభ్యంతరాలపై కేంద్రం నిర్లక్ష్యంగా ఉంటోంది. ప్రస్తుత ఎంపీల సంఖ్య 543ని మరో 25 ఏండ్లు కొనసాగించాలి. లోక్ సభలో రాష్ట్రాల ప్రస్తుత వాటా మరో 25 ఏండ్లు ఉండాలి. 2029లోక్ సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి అని లేఖలో తెలిపారు.

## ఆ ఇద్దరి వ్యవహారంపై అంతిమ నిర్ణయం ఏఐసీసీదే: మహేశ్‌కుమార్‌గౌడ్

మొదటిపేజీ తరువాయి
ఏఐసీసీ ప్రకటన వచ్చేంత వరకు ఆ విషయంపై మాట్లాడబోమని స్పష్టం చేశారు. ఏదైనా విషయాన్ని చర్చించేందుకు కొండా మురళి తనతో భేటీ కావొచ్చని, ఇందులో ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. 22ఏ అంశంపై భాజపా, బీఆర్ఎస్‌లు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఆయా పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టం మంచి ఫలితం ఇస్తోందని వివరించారు.

## వారంలో తెలంగాణ కేబినెట్ విస్తరణ!

మొదటిపేజీ తరువాయి
రెండు రోజులుగా హైదరాబాద్‌లో ఉన్న కొండా మురళి తన ప్రయత్నాలు తాను చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక గత మూడు రోజులుగా ఎక్కడ కనిపించని సుస్మిత పటేల్ హడావుడి లేకుండా సైలెన్స్ మూడ్‌లోకి వెళ్లిపోయారు. మరో వైపు, మాజీ ఓఎస్డీ సుమంత్ జాడ కోసం వరంగల్‌లో కూడా టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని రాష్ట్రవాప్తంగా ఆసక్తి నెలకొంది.

## చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్-విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్లు ఉన్నచోట ఫ్లైఓవర్లు త్వరలో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రహదారులపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. మిగతా ఫ్లైఓవర్లు డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రమాదాలు నివారించాలంటే రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. 6౦2 లేన్ల రహదారి విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినట్లు కోమటిరెడ్డి తెలిపారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశం..
## రెండు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు

హైదరాబాద్: ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై కేంద్రం ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 1న కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది.



తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తితో ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి కేంద్రం ముందుకొచ్చింది.

## యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి: రాజ్‌నాథ్ సింగ్



యుద్ధ ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ.. భూతల దాడుల్లో యుద్ధ ట్యాంకులు కీలకమని తెలిపారు. అవి శత్రువుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తాయని, యుద్ధక్షేత్రంలో సైనికుల మనోధైర్యాన్ని పెంచుతాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని 'వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పుర్'లో టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతుల కోసం రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం రాజ్‌నాథ్ ఈమేరకు ప్రసంగించారు.
"అత్యంత శక్తిమంతమైన సైన్యం కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. డ్రోన్లు, క్షిపణులు, ఇతర అధునాతన సాంకేతికతలతో యుద్ధం తీరు వేగంగా మారుతోంది. అంతమాత్రాన ట్యాంకులు ప్రాధాన్యం కోల్పోయాయని కాదు. రణరంగంలో ఒకే వ్యవస్థపై ఆధారపడకుండా.. సమష్టి సామర్థ్యం కలిగి ఉండటం అవసరం. డ్రోన్లు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతోపాటు ఆధునిక ట్యాంకులూ ముఖ్యమే. భూతల దాడుల్లో టీ-72, టీ-90 ట్యాంకులు ఎంతో కీలకం. దేశ సరిహద్దుల్లో అవి ఉక్కు గోడలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న కేంద్రంలో ఏటా 80 ట్యాంకులకు మరమ్మతులు చేయొచ్చు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## లోక్‌సభ స్థానాలు మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలి.. ప్రధాని మోదీకి ఖర్గే లేఖ



నియోజకవర్గాల పునర్విభజన పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు.

## గూఢచారులు, స్లీపర్ సెల్స్‌తో.. ఎస్-400 వ్యవస్థను గుర్తించేందుకు పాక్ ప్రయత్నాలు



పాకిస్థాన్ ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ఎస్-400 గగనత రక్షణ వ్యవస్థ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అయితే, ఇందుకు సంబంధించి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా (రిటైర్డ్) కీలక విషయాలు వెల్లడించారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థలను గుర్తించడానికి దాయాది దేశం ఎన్నో ప్రయత్నాలు చేసిందని, ఇందుకోసం భారత్‌లో ఉన్న పాక్ గూఢచారులు, స్లీపర్ సెల్స్‌ను యాక్టివేట్ చేసిందని చెప్పారు.వాయుసేనలో సుదీర్ఘ కాలం సేవలందించిన మిశ్రా. ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా ఉన్నారు. ఇటీవల ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత క్షిపణి వ్యవస్థను అతిపెద్ద ముప్పుగా పాక్ భావించిందన్నారు. వాటిని గుర్తించేందుకు దాయాది దేశం అనేక ప్రయత్నాలు చేసిందని, ఇతర దేశాల నుంచి ఉపగ్రహాల సహాయాన్ని కూడా తీసుకుందని చెప్పారు. భారత్‌లో వాటి స్థావరాలను గుర్తించేందుకు స్లీపర్ సెల్స్‌నూ క్రియాశీలం చేసిందన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 28, 2026

# తపాలా శాఖలో 25 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
దేశవ్యాప్తంగా 25,000కు పైగా GDS, BPM, ABPM పోస్టుల భర్తీకి తపాలా శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఎలాంటి రాత పరీక్ష లేకుండానే ఈ ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 19 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 918, తెలంగాణలో 419 ఖాళీలు ఉన్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 21 వరకు అధికారిక పోర్టల్ indiapost.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 18-40 ఏళ్లు.

# అయిలాపూర్ లో ఓటర్ల జాబితా పై గ్రామ సభ

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో గురువారం SIR లో భాగంగా కొత్త ఓటర్ల జాబితా ముద్రణ అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలోని పేర్ల తొలగింపు, No Mapping, Anomalies జాబితాలకు సంబంధించిన వివరాలను అధికారులు గ్రామ సభలో వెల్లడించారు. సంబంధిత అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించి, అభ్యంతరాలు సూచనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ద్యావనపెల్లి రామకృష్ణ, ఉపసర్పంచ్ శ్రీమతి వనపర్తి సౌమ్య, GPO\T సంపత్, హుస్సేన్, వార్డు సభ్యులు, దీూలు, BLAలు, ఓటర్లు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్‌పల్లి యువత విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి దేశ అభివృద్ధికి కృషి చేయాలని మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు సూచించారు. రాఖీ పండుగను పురస్కరించుకొని ముందస్తు రక్షాబంధన్‌లో భాగంగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొక్కెనపల్లి నాగరాజ్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ బాబుకు రాఖీ కట్టారు. అనంతరం మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలపై రూపొందించిన అవగాహన కరపత్రాన్ని అందజేశారు.

# వార్డులో ఇంటింటికి మొక్కల పంపిణీ చేసిన కౌన్సిలర్ బొడ్ల వసుధ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్‌పల్లి పట్టణంలోని 9వ వార్డులో గురువారం కౌన్సిలర్ బొడ్ల వసుధ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పచ్చదనం పెరగడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని ఆమె పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత మెట్‌పల్లి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్ల నాగేష్, భూమేశ్వర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, ఆరిఫ్, ఖాలీక్, సల్మాన్, ప్రజలు పాల్గొన్నారు.

# స్వీట్ హౌస్ పై ఎస్ఓటి పోలీసులు దాడులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ స్వీట్ హౌస్ పై ఎస్ఓటి పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ ఆరోగ్యానికి హాని కలిగించే సింథటిక్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రాజస్థాన్ కు చెందిన నిర్వాహకుడు కమల్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌కు ఘన సన్మానం

- కాకతీయ విశ్వవిద్యాలయంతో పరిశోధనా సహకారానికి అంగీకారం

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**
సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలోని కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీలో ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్యులు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. భారత పర్యటనలో భాగంగా.., శుక్రవారం ఆచార్య గాదె సమ్మయ్య ఆహ్వానం మేరకు కళాశాలను సందర్శించిన ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ విద్యా సౌకర్యాలు, పరిశోధనా ప్రయోగశాలలను పరిశీలించి, కళాశాలలో జరుగుతున్న శాస్త్రీయ పరిశోధనలను ప్రశంసించారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పరిశోధకులు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులకు ప్రత్యేక అకాడమిక్ ఉపన్యాసం నిర్వహించి, వినూత్నమైన



పరిశోధనల ద్వారా సమాజానికి ఉపయోగపడే ఫలితాలు సాధించాలని సూచించారు.
కాకతీయ విశ్వ విద్యాలయంతో పరిశోధనా సహకారం ఏర్పాటు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చి ఉమ్మడి పరిశోధనలకు అవసరమైన ఆర్థిక సహాయం, ప్రాజెక్టు సహాయకునికి ఉపకార వేతనం అందించేలా కృషి చేస్తానని ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ.. ఫార్మకాలజీ, ఔషధ భద్రత, ఔషధ మొక్కలు, క్యాన్సర్, న్యూరో ఫార్మకాలజీ తదితర రంగాల్లో ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన 150కు పైగా శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలు, పలు గ్రంథాలను రచించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వేలాది సార్లు ఉదహరించబడిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారని చెప్పారు. ప్రపంచంలోని అత్యుత్తమ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో పలుమార్లు స్థానం సంపాదించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆచార్యులు నరసింహారెడ్డి, ప్రసాద్, సమ్మయ్య నాగరాజు, స్వరూపరాణి, షాయదా, సునీత, ఉషాకిరణ్, ప్రియాంక, సుకన్య, సుజాత, సంగీత, భాగ్య, శశిధర్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి







- అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు మహా ర్యాలీ...
- కలెక్టరేట్ ఎదుట ధర్నా... 20 డిమాండ్లతో కలెక్టర్‌కు వినతి

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 27**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ఇప్పటికైనా సముచిత గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించి న్యాయం చేయాలని సి.పి.యు.ఎస్.ఐ, డి.బి.ఎస్.వి ఉద్యమకారులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను పణంగా పెట్టి ఉద్యమించిన నిజమైన ఉద్యమకారులకు ప్రభుత్వం తక్షణమే గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించాలని డిమాండ్ చేస్తూ.. ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ (సి.పి.యు.ఎస్.ఐ), దళిత బహుజన శ్రామిక విముక్తి (డి.బి.ఎస్.వి) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు, నినాదాలతో సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిగా రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా జరగాలని అన్నారు. ఉద్యమ చరిత్ర తెలిసిన, రాజకీయాలకు దూరంగా ఉన్న విశ్వసనీయ ఉద్యమ నాయకులతో జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి, ఉద్యమకారుల పాత్ర, త్యాగాలు, కేసులు, అరెస్టులు, జైలు జీవితం, గాయాలు, ఆర్థిక నష్టాలను పరిశీలించి మాత్రమే అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం, గుర్తింపు కార్డులు జారీ చేయడం, ఉచిత బస్సు-రైలు ప్రయాణం కల్పించడం, కుటుంబాలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు అందించడం, 250 గజాల ఇంటి స్థలం, పక్కా ఇల్లు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో సేవలందించిన జర్నలిస్టులను గౌరవించి సహాయం అందించడంతో పాటు, ఉద్యమ కవులు, కళాకారులు, రచయితలకు నెలకు రూ.25 వేల పెన్షన్, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఉద్యమంలో ఆర్థిక, శారీరకంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించాలని, మారోజు వీరన్న విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ఆయనతో పాటు 145 మంది అమరులను అధికారిక తెలంగాణ అమరవీరులుగా గుర్తించి వారి కుటుంబాలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ప్రతి జిల్లాలో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయడం, తెలంగాణ కళాకారులకు సినిమా పరిశ్రమలో అవకాశాలు కల్పించడం, ఉద్యమకారుల ఉపాధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీయూఎస్ఐ - డీబీఎస్‌వీ కమిటీ నాయకులు, ఉద్యమ కారులు తదితరులు పాల్గొన్నారు.

# సోదరభావానికి, ఆధ్యాత్మిక రక్షణకు ప్రతీక రాఖీ పండుగ: ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



పవిత్రమైన రక్షాబంధన్ - ఆగస్టు 28 (రాఖీ) పండుగ సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సోదరీమణులు ఆయనకు మిఠాయిలు తినిపించి, ఈశ్వరీయ ఆశీస్సులు అందించారు.
?అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల అనురాగానికి సూచిక మాత్రమే కాదు, సమాజంలో సోదరభావాన్ని, పరస్పర రక్షణ భావనను పెంపొందించే అత్యంత పవిత్రమైన పండుగని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఒకరికొకరు రక్షణగా నిలవాలని, ప్రేమాభిమానాలతో జీవించాలని ఈ పండుగ మనకు సందేశాన్నిస్తుందని అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ప్రత్యేకంగా కొనియాడారు. సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో, మానసిక ప్రశాంతతను అందించడంలో బ్రహ్మకుమారీ సంస్థ పాత్ర ప్రశంసనీయమని తెలిపారు. మానవత్వ విలువలు, శాంతి, సద్భావన వ్యాప్తికి ఈ సంస్థ చేస్తున్న కృషి సమాజానికి ఎంతో అవసరం అని వెల్లడించారు. ?తన వద్దకు వచ్చి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీ ప్రతినిధులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# పీఆర్టీయూ-టీఎస్ వెల్గటూరు మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- సెప్టెంబర్ 1న జరిగే 'చలో హైదరాబాద్"ను విజయవంతం చేయాలని పిలుపు

**కరపత్రం ప్రతినిది జగిత్యాల/వెల్గటూరు, ఆగస్టు 27**



ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (పి ఆర్ టి యు - టి ఎస్) వెల్గటూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం రాజరాంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్నికల అధికారి జోగం శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా మందాడి శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మ్యాక శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా అన్నాడి వెంకటేశ్వర్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కొప్పుల సరిత, ఉపాధ్యక్షుడిగా బొద్దుల చంద్రశేఖర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి. మునీంద్ర, కార్యదర్శులుగా పి. రాకేష్, జి. రమ్యశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలను మంజూరు చేయడంతో పాటు పీఆర్సీని అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్) పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
అలాగే ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వెల్గటూరు మండలంలోని ఉపాధ్యాయులందరూ భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేయాలని నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది.
ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ముద్దసాని జయాకర్, వడ్లకొండ నాగయ్య, పీఆర్టీయూ సభ్యులు రామచంద్రం, నరేష్, సంతోష్ కుమార్, వెంకటరవి, మహేష్, గోస్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రక్షాబంధన్ -- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

- సమాజంలో ప్రేమ, బాధ్యత, సంస్కృతిని చాటే పండుగ : టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**
రక్షాబంధన్-రాఖీ పౌర్ణమి సందర్భంగా.. (ఆగస్టు 28) టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బిర్లా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు రాష్ట్ర ప్రజలకు, ఓరుగల్లు ప్రజలకు, సోదరా సోదరిమణులకు, టిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. రాఖీ అనేది కేవలం ఒక దారం మాత్రమే కాదని, అది ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం, బాధ్యత, రక్షణ అనే ఐదు విలువలను ముడిపెట్టే పవిత్ర బంధమని అన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలపరిచే ఈ పండుగ కుటుంబ వ్యవస్థను సుస్థిరం చేయడంతో




పాటు సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ బంధాలు, మానవీయ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అలాంటి సమయంలో రక్షాబంధన్ వంటి పండుగలు మన సంస్కృతి గొప్పతనాన్ని, కుటుంబ బంధాల విలువను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరినీ ఒకే తాటిపైకి తీసుకువస్తాయని అన్నారు.
మహిళల గౌరవం, భద్రత, సాధికారత ప్రతి కుటుంబం, ప్రతి సమాజం బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి మహిళను సోదరిగా, కుమార్తెగా భావించి ఆమె గౌరవాన్ని కాపాడే సామాజిక చైతన్యం పెంపొందినప్పుడే రక్షాబంధన్ పండుగ సార్థకమవుతుందని పేర్కొన్నారు.
దేశం అభివృద్ధి చెందాలంటే కుటుంబ వ్యవస్థ బలపడాలని, కుటుంబాలు బలపడాలంటే పరస్పర ప్రేమ, విశ్వాసం, బాధ్యత వంటి విలువలు నిలవాలని ఆయన అన్నారు. యువత భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్రమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంటిలో ఆనందం, ఐక్యత, సోదరభావం వెల్లివిరియాలని, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో బీజేపీ అధికారం కోసం సమ్మక్క-- సారలమ్మ సన్నిధిలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు

- పరకాల నియోజకవర్గంలో బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ నాయకత్వంలో బీజేపీ విజయపతాక ఎగరాలని ప్రత్యేక పూజలు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజల్లో తీవ్ర నిరాశ - మార్పు కోసం తెలంగాణ ఎదురుచూస్తోందని బీజేపీ నాయకుల వ్యాఖ్య





**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలని, పరకాల నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ నాయకత్వంలో కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం ములుగు జిల్లా మేడారంలోని ఆదివాసుల ఆరాధ్య దైవాలు సమ్మక్క--సారలమ్మ అమ్మవార్ల సన్నిధిలో భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు సుభిక్షం, తెలంగాణ అభివృద్ధి, బీజేపీ విజయంతో ప్రజాపాలన నెలకొనాలని దేవతలను వేడుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆ ఆశలు నెరవేరలేదని విమర్శించారు. ప్రభుత్వంలో నెలకొన్న అంతర్గత విభేదాలు, పదవుల కోసం జరుగుతున్న కుమ్ములాటలు పాలనను పూర్తిగా దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ లెక్కల్లోనే మునిగిపోయిందని, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజలు ఇప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని కోరుకుంటున్నారని, పారదర్శక పాలన, అభివృద్ధి, అవినీతి రహిత పరిపాలనకు భారతీయ జనతా పార్టీనే సరైన ప్రత్యామ్నాయమని వారు స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు విశేష ఆదరణ చూపుతున్నారని, అదే విధంగా తెలంగాణలో కూడా బీజేపీకి ప్రజలు అవకాశం కల్పించే రోజు ఎంతో దూరంలో లేదని విశ్వాసం వ్యక్తం చేశారు.

పరకాల నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువవుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్ నాయకత్వంపై కార్యకర్తల్లో విశేష ఉత్సాహం నెలకొన్నట్లు నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న డాక్టర్ కాళీ ప్రసాద్ నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో పరకాలలో భారతీయ జనతా పార్టీ విజయపతాకాన్ని ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల ఆశీస్సులతో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలని, పరకాల నియోజకవర్గంలో డాక్టర్ కాళీ ప్రసాద్ నాయకత్వంలో కాషాయ జెండా రెపరెపలాడాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల దీవెనలు, దేవతల అనుగ్రహంతో ఆ లక్ష్యం తప్పక నెరవేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల టౌన్, పరకాల రూరల్, నడికూడ,ఆత్మకూర్,గీసుగొండ, దామెర, సంగెం మండలాల బిజెపి అధ్యక్షులు 15,16,17 డివిజన్ ల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రక్షాబంధన్ - రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు.. తెలిపిన చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి

- రాఖీ పౌర్ణమి బంధం ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీక




**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**

'రక్షాబంధన్ -- రాఖీ పౌర్ణమి" - ఆగస్టు 28 పర్వదినాన్ని పురస్కరించుకొని, శుక్రవారం హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి రాష్ట్ర ప్రజలకు, ఓరుగల్లు ప్రజలకు, రైతు సోదర సోదరీమణులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రక్షాబంధన్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం, రక్షణ భావాన్ని మరింత బలోపేతం చేసే భారతీయ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి అతని క్షేమాన్ని కోరుకుంటే, సోదరుడు జీవితాంతం ఆమెకు అండగా ఉంటాననే భరోసా ఇవ్వడం ఈ పర్వదిన విశిష్టత అని అన్నారు. భారతీయ సంప్రదాయాలు, కుటుంబ విలువలు, పరస్పర అనుబంధాలను భావితరాలకు అందించే పండుగల్లో రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవాలని, సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ పవిత్రమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంతో నిండిపోవాలని కోరుతూ.. చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి మరోసారి 'రక్షాబంధన్" శుభాకాంక్షలు తెలియజేశారు.

# అర్హుల ఓటు హక్కును కాపాడాలి..

- అభ్యంతరాల గడువును నవంబర్ 30 వరకు పొడిగించాలి
- ఓటర్ల జాబితాలో లోపాలను వెంటనే సరిదిద్దాలి
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్




**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**

రాష్ట్రంలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించవద్దని, ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ గడువును నవంబర్ 30 వరకు పొడిగించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 17న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 92 లక్షలకు పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించినప్పటికీ, ముసాయిదా జాబితాలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన పలువురి పేర్లు జాబితాలో లేకపోవడం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి తప్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓటర్ల నుంచి ఫారాలు సక్రమంగా నింపించుకోలేకపోవడానికి అధికారుల అవగాహన కార్యక్రమాల లోపమే ప్రధాన కారణమని వెంకట్రాములు విమర్శించారు. ప్రజలకు తగిన సమయం ఇవ్వకపోవడం, పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

17వ తేదీ నుంచే నోటీసులు అందజేస్తామని ప్రకటించిన ఎన్నికల సంఘం, అనంతరం పలు కారణాలతో ప్రక్రియ ఆలస్యమైందని పేర్కొంటూ 27వ తేదీన పోలింగ్ కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించి ఓటర్ల జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తామని తెలిపిందన్నారు. అయితే, ఆ సమావేశాలు కూడా నామమాత్రంగానే జరిగాయని ఆయన ఆరోపించారు.

పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు (బీఎల్వోలు) అందజేసిన నోటీసులకు స్పందిస్తూ సెప్టెంబర్ 20లోపు అసలు ధ్రువపత్రాలు సమర్పించకపోతే ఓటు హక్కు రద్దవుతుందని ప్రకటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వెంకట్రాములు పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అధికారులు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన కార్మికులు, కర్షకులు, చేతివృత్తుల వారు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, అలాగే వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వంటి అనేక వర్గాల ప్రజలు గడువులోపు స్పందించడం కష్టసాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభ్యంతరాల స్వీకరణ గడువును నవంబర్ 30 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# రక్షాబంధన్ - రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు.. తెలిపిన డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

- రాఖీ పౌర్ణమి బంధం ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీక
- కాంగ్రెస్ జిల్లా నాయకులు, జనగామ జిల్లా కాంగ్రెస్ డిసిసి కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి




**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**

'రక్షాబంధన్ -- రాఖీ పౌర్ణమి" - ఆగస్టు 28 పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ జిల్లా నాయకులు, జనగామ జిల్లా కాంగ్రెస్ డిసిసి కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి సోదర సోదరీమణులకు, ఓరుగల్లు ప్రజలకు, జనగామ జిల్లా ప్రజలకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. రక్షాబంధన్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం, రక్షణ భావాన్ని మరింత బలోపేతం చేసే భారతీయ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి అతని క్షేమాన్ని కోరుకుంటే, సోదరుడు జీవితాంతం ఆమెకు అండగా ఉంటాననే భరోసా ఇవ్వడం ఈ పర్వదిన విశిష్టత అని అన్నారు. భారతీయ సంప్రదాయాలు, కుటుంబ విలువలు, పరస్పర అనుబంధాలను భావితరాలకు అందించే పండుగల్లో రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవాలని, సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ పవిత్రమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంతో నిండిపోవాలని కోరుతూ.. డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి 'రక్షాబంధన్" శుభాకాంక్షలు తెలియజేశారు.

# రక్షాబంధన్ - రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత మాచర్ల సదానందం గౌడ్

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకే రక్షాబంధన్
- ఎలుకుర్తి గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి మాచర్ల సదానందం గౌడ్




**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 27**

రక్షాబంధన్ -- రాఖీ పౌర్ణమి - ఆగస్టు 28 పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలుకుర్తి గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి మాచర్ల సదానందం గౌడ్ జిల్లా ప్రజలకు, ఎలుకుర్తి గ్రామ ప్రజలకు, సోదరా.. సోదరిమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేసే గొప్ప భారతీయ సంప్రదాయానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మాచర్ల సదానందం గౌడ్ మాట్లాడుతూ.. 'రక్షాబంధన్" అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య విడదీయరాని అనుబంధాన్ని, పరస్పర విశ్వాసాన్ని, రక్షణ బాధ్యతను గుర్తు చేసే పవిత్రమైన పండుగ అని అన్నారు. రాఖీ అనే చిన్న దారంలో అపారమైన ప్రేమ, ఆత్మీయత, బాధ్యత, కుటుంబ విలువలు నిక్షిప్తమై ఉంటాయని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉందని, అలాంటి విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు, కుటుంబ బంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తరహా పండుగలు కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకార స్ఫూర్తిని పెంచుతాయని తెలిపారు. యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, వాటిని ఆచరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఐశ్వర్యం, సుభిక్షం వెల్లివిరియాలని, సోదర సోదరీమణుల ప్రేమ చిరస్థాయిగా నిలవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. చివరగా జనగామ జిల్లా ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్ - రాఖీ పౌర్ణమి పర్వదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ.. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని, సంతోషాన్ని, శాంతిని తీసుకురావాలని మాచర్ల సదానందం గౌడ్ మనసారా ఆకాంక్షించారు.

# తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 27**

హన్మకొండ: బంజారా జాతి గర్వించే ఘనమైన పండుగ తీజ్ ఉత్సవాలను హన్మకొండలోని గిరిజన భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు.బీజేపీ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు సీతారాం నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు,బీజేపీ రాష్ట్ర నాయకుడు,వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బంజారా సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ నాగినేని సంపత్‌రావు,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల మహేష్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు,బంజారా సోదర సోదరీమణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఓబీసీ కులగణనపై ప్రధానికి లేఖ..

## ఖర్గే, రాహుల్ గాంధీకి టీజీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా గంగపుత్ర కృతజ్ఞతలు

- ఓబీసీల సామాజిక న్యాయ సాధనకు కీలక అడుగుగా కులగణన
- జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి



**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 27**

ఓబీసీ కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలకు టీజీఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని ఓబీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయాలంటే సమగ్ర కులగణన అత్యంత అవసరమని రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. జనాభా నిష్పత్తి ఆధారంగా బీసీలకు హక్కులు, అవకాశాలు, సంక్షేమ పథకాలలో సముచిత వాటా కల్పించేందుకు కులగణన కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఓబీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం జాతీయ స్థాయిలో గళమెత్తుతున్న మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు బీసీ సమాజం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కులగణన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, సామాజిక న్యాయం మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు.

# మహమ్మద్ ప్రవక్త బోధనలు పాటిస్తూ.. చూపిన మార్గంలో నడవాలి

**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 27**



వరంగల్ జిల్లా: మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ,ఆయన చూపిన మార్గంలో నడిచి ఆశయ సాధనకు ముందుకు సాగాలని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోచమ్మ మైదానం సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సయ్యద్ వాసిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు.ఈ సందర్భంగా కీర్ స్వీట్ పంపిణీ చేసి,అనంతరం నిర్వహించిన ఊరేగింపును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ,శాంతి,సోదరభావం,మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.ప్రవక్త ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఉర్సు కరీమాబాద్ మాషూక్ రబ్బానీ దర్గా పీఠాధిపతి ఉబెదు బాబా,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నవీన్ రాజు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమీర్,ముస్లిం పెద్దలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.